# సాయిని అనుసరించండి, సత్యమార్గంలో నడవండి!

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యమందణగె సర్వసృష్టి**
**సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న?**
**శుద్ధసత్త్వమిదియె చూడరయ్య!**

సర్వత్రా సత్యమే వ్యాపించియున్నది. సర్వత్రా సత్యమే సంచరించుచున్నది. సర్వత్రా సత్యమునే దర్శించుచున్నాము. మన దర్శన, స్పర్శన, సంభాషణములన్నీ సత్యముతో కూడినవే! సత్యమునకొక రూపము లేదు. మనము దేనిని చూచినా అది సత్యమే! (స్వామి ఒక ఉంగరమును సృష్టించారు). ఇది సత్యము. ఇది ఎక్కడినుండి వచ్చింది? సత్యమునుండియే వచ్చింది, సత్యములోనే చేరిపోతుంది (అందరూ చూస్తూ ఉండగా స్వామి దివ్య హస్తమునుండి ఆ ఉంగరము అదృశ్యమైంది) 'సర్వం ఖల్విదం బ్రహ్మ'. సత్యమే బ్రహ్మస్వరూపము. సత్యము రెండు కాదు, ఒక్కటే! అయినప్పటికీ సత్యమును గుర్తించడానికి చాలా ప్రయత్నము చేయవలసి ఉంటుంది. సత్యమనగా కేవలం వాక్కుతో చేరినది మాత్రమే కాదు. సత్యము అనేక విధములైన అవతారములు ధరించి నటువంటిది. 'అనంత రూపం బ్రహ్మ'. సర్వము బ్రహ్మమయమే! కనుకనే, 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' అన్నారు. మిగిలినదంతయు దాని ప్రతిబింబమే తప్ప అన్యము కాదు. సత్యము ఒక్కటే అయినప్పటికీ అనేక రూపనామములతో దర్శన మిస్తుంటాది. సర్వమూ సత్యమునుండి పుట్టినటువంటిదే! సత్యమునుండి ధర్మము వచ్చింది. "సత్యాన్నాస్తి పరో ధర్మః" సత్య,

sri sathyasai vachanamrutam

ధర్మములు ఏకమైనప్పుడు శాంతి ఏర్పడుతుంది. శాంతివలన ప్రేమ, ప్రేమనుంచి ఆనందము ఆవిర్భవిస్తున్నాయి. ఎప్పుడు ప్రేమ పుట్టినదో అప్పుడు ద్వేషము నిర్మూలమై అహింస ప్రారంభ మవుతుంది. కాబట్టి, ఈనాడు అహింస అనేది కావాలంటే ప్రేమను అభివృద్ధి చేసుకోవాలి. ప్రేమ ఒక్కటి ఉండెనా, సర్వులూ ఏకమైపోతారు.

**"మీరు నేనే, నేను మీరే"**

"మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" "అందరూ నా అంశములే. మీరు ప్రత్యేకమైనటువంటివారు కాదు; మీరు నా ప్రతిబింబములే! మీరు నేనే, నేను మీరే!" రూపనామములు వేరువేరు కావచ్చు. కాని, అందరియందున్నది ఒకటే ఆత్మ. ఒక్కొక్క శరీరమునకు ఒక్కొక్క పేరు పెట్టారు. ఈ పేర్లు కేవలం గుర్తింపుకోసం పెట్టినవేగాని మీ నిజతత్త్వమును నిరూపించునవి కావు. ఆత్మయే మీ నిజతత్త్వము. కనుక, ఆత్మను ప్రేమించండి. ఇట్టి ప్రేమను అభివృద్ధి పరచుకున్నప్పుడు సర్వులుకూడను ఏకము కావచ్చు. మనకు భేదభావములు ఏమాత్రము సంభవించవు. ద్వైతభావమనేది అప్పుడు కనిపించదు. ద్వైత భావము లేనప్పుడు అంతా ఒక్కటే! A man with dual mind is half blind. మనము గ్రుడ్డివారం కాదు. మనకు రెండు కన్నులున్నాయి. రెండూ చేరి ఒకదానినే చూస్తున్నాయి. కనుక, మనమందరంకూడను ఒక్కటే!. మానవ సోదరత్వము, దైవపితృత్వము – ఈవిధమైన భావమును మనం పోషించుకున్నప్పుడు ఈ జగత్తులో భేదములు, కలహములు, కల్లోలములు, అశాంతులు కానరావు. మానవులంతా ఏకమవుతారు.

నీవంటావు, 'నేను మానవుడను' అని. అయితే, మానవుడంటే ఎవరు? కామ, క్రోధములతో కూడినటువంటివాడా? కాదు, కాదు. 'మానవ' అనగా భేదము లేకుండా జీవించేవాడని అర్థం. మనలో ఎటువంటి భేదములూ తలెత్తకూడదు. మనమందరం ఆత్మ స్వరూపులమే! అందరం ఒకే తండ్రి బిడ్డలమే! రూప నామములను పురస్కరించుకొని భేదభావములను అభివృద్ధిపరచుకోకూడదు. ఎక్కడికి పోయినప్పటికీ మనము ఏకంగా ఉండాలి. అయిదు వ్రేళ్ళు వేరువేరుగా ఉన్నప్పటికీ హస్తము ఒక్కటే!

sri sathyasai vahanamrutam

**శృంగారములు వేరు, బంగారమొక్కటే.**
**పశుల వన్నెలు వేరు, పాలు ఒక్కటే**
**జీవజాతులు వేరు, జీవుండు ఒక్కడే**
**జాతినీతులు వేరు, జన్మమొక్కటే.**

చూడండి, ఇక్కడ ఎన్ని బల్బులు వెలుగుతున్నాయి! బల్బులు వేరువేరుగా కనిపించినప్పటికీ కరెంటు ఒక్కటే! ఈ దేహాలన్నికూడను బల్బులవంటివి. ఒక్కొక్క బల్బు ఒక్కొక్క 'పవర్'తో కూడివుండవచ్చు. అట్లే, మానవులందరూ ఒక్కటే అయినప్పటికీ 'పవర్'లో వ్యత్యాసముంటుంది. కాని, అందరిలోని ఆత్మ ఒక్కటే! ఇట్టి ఏకత్వాన్ని మీకు చూపించాలంటే నాకెంతో ఆనందంగా ఉంటుంది. కాని, నాకు కొన్ని లక్షల జాబులు వచ్చినాయి, "స్వామీ! మీరు లింగమును ఉద్భవింపజేయవద్దు", అని. చాలామంది డాక్టర్లు కూడను 'ఇది మంచిది కాదు' అంటున్నారు. దేహములో ఉన్న సువర్ణము రక్తములో ద్రవరూపంలో ఉంటున్నది. ఇది ఘనరూపము దాల్చవలెనంటే దీనికి ఎంతో 'ఎనర్జీ'ని ఉపయోగించాలి. ఇందుకు దేహానికి తగిన బలముకూడా ఉండాలి. ఒక్కొక్క లింగము ఎంతో బరువుంటుంది. "వీటిని ఉద్భవింపజేసే నిమిత్తమై మీరు ఈవిధంగా 'ఎనర్జీ'ని వినియోగించడం మంచిది కాదు. నమ్మినవారిని నమ్మనీయండి; నమ్మకపోయిన వారిని నమ్మకపోనీయండి. మీ దేహాన్ని మాత్రము ఎక్కువ శ్రమ పెట్టుకోకండి. మాకు మీ దేహము చాలా ప్రధానము. దేహాన్ని ఆశ్రయించి మేము మీ చెంతకు చేరాము. మీ దేహాన్ని మీరు బలహీనపరచుకుంటే మాకు చాలా బాధ కలుగుతుంది. కనుక, మమ్మల్ని అనుగ్రహించి ఈ శక్తిని మీరు కొంతవరకు అరికట్టు కోవాలి" అని ప్రార్థించారు. ఈ దేహము 'పాజిటివ్' పైన ఆధారపడి ఉన్నది. 'పాజిటివ్' పోయిందంటే 'నెగెటివ్' వ్యర్థమైపోతుంది. అయితే, భగవంతుడు తన సంకల్పముచేత ఏదైనా సాధించవచ్చును. ఆకాశమును భూమిగా, భూమిని ఆకాశముగా మార్చవచ్చును. కాని, దీనివల్ల కలిగే ప్రయోజనమేమి? ఆకాశమును భూమిగాను, భూమిని ఆకాశముగాను మార్చితే తరువాత సాధకుల గతి ఏమిటి! "మీరు ప్రజలయొక్క తృప్తికోసమని, ప్రజలను ఆనందపెట్టడంకోసమని మీ శక్తిని ఈవిధముగా వినియోగించకూడదు", అని భక్తులు ప్రార్థిస్తున్నారు. ఇప్పటికే ఈ దేహమునకు 81

sri sathyasai vahanamrutam

సంవత్సరములైనవి. ఇది ఇంకా కొంతకాలము మాత్రం ఉండగలదు. మీకు అనేక విధములైన ఆనందము నందించే నిమిత్తమై నేను దీనిని నిల్పుకోవాలి. త్వరలోనే మీకు అనంతమైన ఆనందాన్ని అందిస్తాను. దేహమును చూసి ఆనందించే భౌతికమైన ప్రజలకు దేహమే ప్రధానము, దేహమే ప్రమాణము. కాబట్టి, ఇంతటి ప్రధానమైనటువంటి ఈ దేహమును సంరక్షించుకోవడం నాకూ ఒక కర్తవ్యమే!

**ఎవరు నిజమైన హిందువు?**

'డివోషన్' (భక్తి) అనేది మన భారతదేశమునకు చాలా ప్రధానమైనది. మీరు భారతదేశమును 'హిందూ (HINDU) దేశమ'ని అంటారు. HINDU అనే ఐదక్షరములు పంచభూతములకు, పంచప్రాణములకు, పంచకోశములకు ప్రతీకలు. HINDU అనే పదముయొక్క అంతరార్థమేమిటి? H - అనగా Humility (వినయం), I - అనగా Individuality (వ్యక్తిత్వం), N - అనగా Nationality (జాతీయతాభావం), D - అనగా Divinity (దివ్యత్వం), U - Unity (ఐకమత్యం). మీరు 'యూనిటీ'గా ఉన్నప్పుడు 'డివినిటీ'ని అభివృద్ధి చేసుకోవచ్చు. 'డివినిటీ'ని అభివృద్ధి చేసుకున్నప్పుడే మనకు శాంతి, సంతోషములు చేకూరగలవు. మనం జాతీయతాభావమును కాపాడుకోవాలి. జాతిసమైక్యతపట్ల విశ్వాసాన్ని మనస్సులో పెట్టుకోవాలి. Nationality (జాతీయతాభావము)ను కాపాడేది ఏమిటి? అదే Individuality (వ్యక్తిత్వం). అదే Humanity (మానవజాతి) ని పోషిస్తుంది.

ప్రపంచములో అన్నింటినీ కొంతవరకు మనము ఒక 'లిమిట్'లో పెట్టుకోవాలి. అప్పుడే మనకు శాంతి చిక్కుతుంది. భగవంతుడు ఎక్కడ చూసినా ఉన్నాడు. "సత్యంబునందుండి సర్వంబు సృష్టించె. సత్యంబు నందణగె సర్వసృష్టి" సర్వసృష్టి తత్త్వము సమష్టి తత్త్వమే. సర్వత్రా సమత్వమే కనిపిస్తుంది. దైవము ఎక్కడో ఉన్నాడని అనుకోకండి. మీరందరూ దైవస్వరూపులే! ఆ తత్త్వాన్ని మీరు మనస్సులో పెట్టుకోవాలి. ఈ సత్యము ప్రతి ఒక్క మానవునకు ప్రత్యక్షంగా దర్శనమిస్తున్నది. నీవు కన్నులు మూసుకొని యోచించు; Who am I? (నేనెవరు?) అని ప్రశ్న వేసుకో. నీవు కన్నులు మూసుకున్నప్పుడు నీకేమి

srisathyasaivachanamrutam

కనిపిస్తుండాది? ఏమీ కనిపించడం లేదు. 'నేను ఎవరు? నేను ఎవరు?' అనే ప్రశ్న మాత్రం వినిపిస్తుండాది. అప్పుడు తెలుస్తుంది, "నేను దేహాన్ని కాదు" అని. ఈ రూపనామములన్నీకూడను మార్పు చెందేటటువంటివేగాని, శాశ్వతంగా ఉండేవి కావు.

కాయము కష్టపడి పనిచేసే నిమిత్తమై ఏర్పడినది. కష్టమే లేకపోతే సుఖమే మనకు ప్రాప్తించదు. కాబట్టి, కష్టము లేకపోయినా దానిని మనము తెప్పించుకోవాలి. Pleasure is an interval between two pains. రెండు బాధలమధ్యలోనే ఒక సుఖము చిక్కుతుంది. ఎక్కడ మనకు కష్టము కలిగిందో అక్కడే సుఖము ప్రాప్తిస్తుంది. కష్టము కొద్దికాలమే తప్ప ఎక్కువ కాలము ఉండదు. ఎక్కువ సుఖమును సంపాదించాలంటే మనము కష్టమును కొంచెమైనా అనుభవించాలి.

**ఆత్మతత్వాన్ని విశ్వసిస్తే అదే మిమ్మల్ని రక్షిస్తుంది**

ఒకానొక సమయంలో పురందరదాసు చెప్పాడు – "రామా! నెమలి పింఛమునకు రంగులు వేసిన వారెవరు? పచ్చని చిలుకకు ఎఱ్ఱని ముక్కు పెట్టి దానిని అందంగా తీర్చిదిద్దినవారెవరు? కొండమీద పుట్టిన వృక్షమునకు కట్టకట్టి నీళ్ళు పెట్టినవారెవరు? రాతిలో పుట్టిన కప్పకు ఆహారమును అందిస్తున్న వారెవరు? అన్నింటికీ నీవే ఆధారం. మానవత్వమునకు దివ్యత్వమే ప్రత్యక్ష సాక్షి. కాబట్టి, నీవు అందరినీ రక్షించాలి. అందరిలో ఉండి రక్షించాలి. నీవు ఆత్మ స్వరూపుడవై అందరియందు ఉన్నావు. ఓ దైవమా! ఈ సత్యాన్ని అర్థం చేసుకోవడానికి అందరికీ సరియైన బుద్ధిని ప్రసాదించు." ఆత్మతత్వాన్ని మనము విశ్వసించాలి. ఆత్మకు ఎట్టి నామరూపములూ లేవు. అయినప్పటికీ ఆత్మతత్వాన్ని మీరు విశ్వసిస్తే అదే మీకు సర్వరక్షగా ఉంటుంది. ఆత్మను రక్షించేది ఆత్మయేగాని వేరొకటి కాదు. ఆత్మయే ప్రత్యక్ష దైవము. **"సర్వతః పాణి పాదం..."** సర్వ భూతములయందున్న ఆత్మతత్వమే సత్యమైనది, నిత్యమైనది. ఆత్మయే అన్నింటియందు చేరియున్నది. ఆత్మను విభజింప వీలుకాదు. బల్బులు వేరైనా వాటిలో ప్రసరించే కరెంటు ఒక్కటే! ఒకచోట వైరు కట్ చేస్తే వెలుగుతున్న బల్బులన్నీ ఆరిపోతాయి. అదేరీతిగా, దేహములనే బల్బులు వేరువేరుగా ఉన్నప్పటికీ వాటిలో ప్రసరించే ఆత్మ అనే కరెంటులో ఏమాత్రం వ్యత్యాసం



sri sathyasai vachanamrutam

లేదు.

**సహజమైన జీవితాన్ని గడపండి!**

విద్యార్థులారా! ఈనాడు సైన్సు విపరీతములైన వికారములను సృష్టించుచున్నది. దీనివలన అనేక రకములైన బాధలు సంభవిస్తున్నాయి. అమెరికాలో పశువులకు మాంసం తినిపిస్తున్నారు. అవి మాంసం తినడంవలన ఎక్కువ పాలిస్తాయని వారి ఆశ. కాని, వాటికి వేరే జబ్బులు వస్తున్నాయి. ఆ పాలు త్రాగిన వారికికూడా అనేక జబ్బులు ప్రారంభమవుతున్నాయి. ఈనాడు ఒక్కొక్క దేశము ఒక్కొక్క రకమైన మార్పును కలిగిస్తున్నది. ఒక్క భారతీయులు మాత్రమే సహజమైన జీవితమును గడుపుతున్నారు. 'ఆర్టిఫిషియల్ లైఫ్'ను గడుపకూడదు. కృత్రిమమైన జీవితాన్ని గడిపితే మనకు లభించేవన్నీకూడా కృత్రిమంగానే ఉంటాయి. ఒక చిన్న విషయాన్ని మీరు గమనించండి. ఈనాడు కూరగాయల యందుకూడను ఎంతో మార్పు కలిగింది. మనము ఎంతో ఆకుకూర తినేటటువంటివాళ్ళము. ఆకుకూరలు ఎంతో బలము నిచ్చేటటువంటివి. కాని, ఇప్పుడా ఆకుకూరలకు డ్రైనేజి వాటర్ కట్టి వాటిని కలుషితం గావిస్తున్నారు. ఈనాడు కూరగాయలు, ఆకుకూరలన్నీకూడను పాడైపోయినవి. వంకాయకూర అంటే చాలా మందికి ఇష్టం. ఒక కవి చెప్పాడు, "వంకాయవంటి కూరయు, పంకజముఖి సీతవంటి భామామణియున్ శంకరునివంటి దైవము లంకాధిపు వైరివంటి రాజులు గలరా!" కాని, ఈనాటి వంకాయలకు ఇది వర్తించదు. అవి పూర్తి పాడైపోయాయి. ఈవిధమైన 'పొల్యూషన్' (మాలిన్యము) పెరిగిపోవడం వలన మనలో ఉన్న భావములుకూడా మలినమైపోతున్నాయి.

విద్యార్థులారా! మీరెంతయో చదువుకున్నటువంటివారు. పిచ్చిపిచ్చి పుస్తకాలను చదివి మీ మనస్సును మలినపరచుకోకండి. పవిత్రమైన మన భారతీయ సంస్కృతిని అనుసరించండి. ఈ పవిత్రతను మన ప్రాచీనులు ఎంతో ఆనందంగా అనుభవిస్తూ వచ్చారు. కొంతకాలమునకు విదేశీయులుకూడా భారతీయుల చరిత్రయొక్క సత్యమును గుర్తించి తమలో మార్పు తెచ్చుకుంటారు. అయితే, అంతవరకు మనము కాచుకోనక్కర్లేదు.

sri sathyasai vachanamrutam

ఎప్పటికప్పుడే మనము సరియైన మార్గము ననుసరిద్దాం. దైవము ప్రతి విషయమునూ గుర్తిస్తుంటాడు; మనల్ని అన్నివిధాలుగా రక్షిస్తూ ఉంటాడు. దైవమే మన వెంట ఉండగా మనము దేనికీ భయపడనక్కర్లేదు.

**నేనెప్పుడూ సత్యానికే కట్టుబడి ఉంటాను**

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం నేను పల్లెల్లో సభలు జరిపేవాడిని. బీదవారందరికీ సహాయం చేయాలని ముందుకు పోయేవాడిని. ఒక నిక్కరు, చొక్కా వేసుకొని నేను ప్రజల్లోకి పోతుంటే అందరూ నన్ను వారించి ఒక అడ్డ పంచె తెచ్చి నాకు కట్టేవారు. నేను మాల ఇండ్లకు వెళ్ళేవాణ్ణి. శ్రీమంతుల నుద్దేశించి ఒక పాట రాసి నేను మాలవాళ్ళకు నేర్పించాను.

**నేలను దున్ని విత్తులు నాటి పంటలు పండిస్తే**
**మీరు మేడలోనుండి మెట్లే దిగక మింగికూర్చుంటే**
**చాకిరి అంతా మాపాలా, మంచి సౌఖ్యమంతా మీ పాలా?**

"మాకు చెప్పడానికి మీరెవరు?" అని శ్రీమంతులు ఎవరైనా ఎదురు తిరిగితే వారికి చక్కని జవాబు ఇచ్చేటటువంటివారు.

**దేవుడిచ్చిన ధరణిరా ఇది ఎవడి అబ్బ సొమ్ము?**
**బలవంతులమని పైబడ వస్తే భగవంతుడు లేడా!**
**సహోదరత్వము సాధించేటి మహాత్ములే లేరా!**
**మేలుకొండి, మేలుకొండి, మాయ మరువండి!**

ఈవిధంగా పాటలు రాసి నేను బీదవారికి నేర్పిస్తుంటే ధనికులకు నాపై కోపం వచ్చేది. ఈ దేహముయొక్క అన్నగారుకూడా వచ్చి చెంపదెబ్బలు వేసి, "నీవెందుకు పబ్లిక్‌లోకి పోతావు? ఇంట్లో కూర్చుని చదువుకో! నీవు ఇంటినుండి బయటకు పోకూడదు", అని గట్టిగా మందలించి ఒక రూములో పెట్టి తాళం వేసేవాడు. అక్కడికి అందరుకూడను వచ్చి, 'రాజూ, రాజూ, రాజూ' అని పిలిచేవారు, పాపం! "నాయనలారా! కొంతసేపు ఓపిక పట్టండి. నేను తప్పకుండా వస్తాను. నేను మీవాడను. మీ అభీష్టాలను నేను నెరవేరుస్తాను", అని

sri sathyasai vachanamrutam

వారికెంతో ధైర్యం చెప్పేవాడిని. ఈవిధంగా ఆనాటి మొదలు నేటివరకు బీదలకు నేను తోడ్పడుతూనే ఉన్నాను. బీదలను సంరక్షించడం, వారిని పోషించడం, వారికి అన్నపానాదుల నివ్వటం, ఆనందాన్ని అందించటం .... ఇది నా కర్తవ్యం. నేటికి కూడను మా విద్యార్థులను గ్రామగ్రామాల్లో వీధివీధికీ పంపించి అన్నం పెట్టిస్తున్నాను. ఇంటి ముందుకు ఎవరైనా ఆకలితో వస్తే నేను తినడం మాని నా తట్టలోనిది తెచ్చి వారికి పెట్టేవాడిని. కట్టుకోవడానికి దుస్తులు లేవని వచ్చేవారికి నేను తొడుక్కున్న చొక్కా తీసి ఇచ్చేవాడిని. ఈవిధముగా ప్రతి ఒక్కరికీ ఎంతో సహాయము చేస్తూ వచ్చాను. ఆనాటినుండి 'హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్' ఇదే నా ధ్యేయం. ఈవిధముగా చిన్నతనమునుండి ఇతరులకు సహాయం చేయడంలో నాకెంతో అనుభవమున్నది. అనేకమంది సహాయం చేయాలని చెబుతారుగాని తాము స్వయంగా చెయ్యరు.

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం**
**మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనాం**

ఆనాటినుండి నేటివరకు నేను అందరినీ సంరక్షిస్తూ, పోషిస్తూ, బుద్ధులు చెబుతూ, శ్రేయోమార్గములో నడిపిస్తూ వస్తున్నాను. ఎవ్వరికీ నేను ఎట్టి అపకారమూ చేయలేదు. ద్వేషముగాని, క్రోధముగాని ఎవ్వరిపైనా నేను చూపలేదు. కాని, నేను పైకి వస్తున్నాననే అసూయచేత కొందరు నాపైన అనేక రకములైన కట్టుకథలు కల్పించి, పేపర్లవాళ్ళకు రాసి, వాళ్ళచేత అనేక రకములుగా దుష్ప్రచారం చేయిస్తున్నారు. ఎవరు ఏమి చేసినను నేను దేనికీ భయపడను. నేను ఎప్పుడూ ... సత్యం... సత్యం... సత్యం.... సత్యానికే కట్టుబడి ఉంటాను. ఈ దేహము పేరే సత్యము. నేనెప్పుడూ సత్యమును వదలి మరో దారిపట్టను. ద్వేషముతో ఎవరు దుష్ప్రచారము చేస్తారో వారికి బుద్ధి చెప్పడానికి ముందుకు వస్తాను. ఇకముందు వాళ్ళు ఇటువంటి దుష్ప్రచారమునకు పాల్పడకుండా తగినటువంటి చర్య తీసుకోవాలి. వాళ్ళేదో డబ్బుకు ఆశపడి తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారు. తాము చేసే తప్పును గుర్తించడానికి వాళ్ళు ప్రయత్నించాలి.

**నేను చేసే సర్వకర్మలు మీకోసమే!**

sri sathyasai vahanamrutam

నాలో ఏనాడూ ఎట్టి దోషములూ అణుమాత్రమైనా కనిపించవు. కనుక, మీరందరుకూడను సాయిని అనుసరించండి. దైవచింతన చేసుకుంటూ సత్య మార్గములో నడవండి. సత్యమార్గమును అనుసరిస్తే మీరు దేనినైనా సాధించగలరు. నేను ఎవ్వరినీ బాధపెట్టాలని ఎప్పుడుకూడా తలుచుకోలేదు. అసలు అటువంటి ఆలోచనలు నాదగ్గరకి రావు. ఏది చేసినా మీకోసమేగాని నాకోసం కాదు. నేను తినే భోజనము మీకోసమే! నేను త్రాగే నీరు మీకోసమే! నేను చేసే సర్వకర్మలు మీ నిమిత్తమై చేస్తున్నాను. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించినవారు చాలా ధన్యులవుతారు.

ఈస్టు గోదావరి, వెస్టు గోదావరి జిల్లాల్లో ప్రజలు కలుషితమైన నీళ్ళు త్రాగుతున్నారు. వాళ్ళను నేనింకా చూడలేదు. కాని, వాళ్ళు త్రాగుతున్న నీరు కలుషితమైనదని తెలిసి నేను చాలా బాధపడ్డాను. వారికి మంచినీరు అందించే నిమిత్తం వంద కోట్ల రూపాయలు ఖర్చు పెట్టించాను. క్రింద గోదావరి ప్రవహిస్తున్నది గాని, ఒక్క చుక్కైనా వారు ఏనాడూ త్రాగలేదు. ఆ నీటిని పైపుల ద్వారా పైకి ఎక్కించి వారికి త్రాగునీరు అందించాను. ఇప్పుడు వాళ్లందరూ ఎంతో ఆనందిస్తున్నారు. సాధ్యమైనంతవరకు అందరికీ మంచి చేయడానికి ప్రయత్నించాలి. అప్పుడు మనకుకూడా మంచే కలుగుతుంది, ఆనందం కలుగుతుంది.

విద్యార్థులారా! మీకెవరైనా ద్వేషి ఎదురైతే "ఓ మిత్రమా!" అని ప్రేమతో పలుకరించి నమస్కరించండి. అప్పుడు వారుకూడా మిమ్మల్ని ప్రేమతో పలుకరిస్తారు. అందరూ సోదరులే! ఆవిధంగా మీరు నడుచుకున్నప్పుడే మన సత్యసాయి ఇన్‌స్టిట్యూట్‌కు సత్కీర్తిని సాధించినవారవుతారు. పిల్లలదగ్గర మేము ఒక నయాపైసా తీసుకోవడం లేదు. ఎగ్జామినేషన్ ఫీజుకూడా తీసుకోవడం లేదు. అందరూ వచ్చి ఇక్కడ ఉచితంగా చదువుకొని ఉన్నత డిగ్రీలు పొంది తిరిగి వెళుతున్నారు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి చాలామందిచేత పిహెచ్.డి. చేయిస్తున్నాను. ఈవిధంగా పిల్లలందరూ ఆదర్శప్రాయులై అభివృద్ధిచెందితే మన దేశమెంతో మంచిపేరు పొందుతుంది. మా పిల్లల మంచితనంగురించి అమెరికానుండికూడా మాకు సమాచారం అందుతున్నది. "స్వామీ! మా దేశంలో మీ పిల్లలు అనేకమంది ఉన్నారు. వాళ్ళు మాకెంతో ఆనందాన్ని అందిస్తున్నారు", అన్నారు. మొన్న ఒక స్పెషల్ ప్లేను వచ్చింది. దానినిండా మా కాలేజి పూర్వ విద్యార్థులే! తమ భార్యా పిల్లలను



sri sathyasai vahamrutam

తీసికొని మొత్తం 250మంది వచ్చారు. అందరూ ఎంతో ఆనందాన్ని అనుభవించారు. "స్వామీ! ఇంతటి ఆనందాన్ని మాకందిస్తారని మేము కలలోకూడా తలుచుకోలేదు", అన్నారు. నేను త్వరలోనే ప్రపంచ పర్యటనకూడా చేస్తాను. ఆఫ్రికానుంచి, రష్యానుంచి చాలామంది భక్తులు వస్తున్నారు. రష్యన్ల భక్తి వర్ణనాతీతం. ఇక్కడ ఉన్న విదేశీయులలో చాలామంది రష్యన్లున్నారు. వీళ్ళు ఎంతగానో ఆనందిస్తున్నారు. (చూడండి, అక్కడ చేతులెత్తిన వారందరూ రష్యన్లే). వీరందరికీ చాలా భక్తి. (ఆ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, "మీరు రష్యన్లు కాదు, మావారే! ఐ లవ్ యు ఆల్" అన్నారు భగవాన్)

పిల్లలూ! రష్యా, అమెరికా, జర్మనీ, జపాన్, ఇటలీ, ఫ్రాన్సు అన్నీ వేరువేరు దేశాలుగా ఉన్నాయేగాని, అందరూ మనవారే! ఇక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి వాళ్ళు ఎంతో సహాయం చేశారు; రాత్రింబవళ్ళు పనిచేశారు. వారికి స్వామి అంటే ప్రాణము. నేను ఎక్కడికి పోయినా నా కారు వెనుక పరుగెత్తుకొని వస్తుంటారు. మొన్న మద్రాసుకుకూడా వచ్చారు. స్వామికోసం ఎంత కష్టమునైనా, ఎంత ఖర్చునైనా భరించుకొని వస్తున్నారు. వాళ్ళ భక్తిని చూసి మీరెంతో నేర్చుకోవాలి.

**(శివరాత్రి సందేశం, తేదీ 16.02.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam